సాక్షి తిరుపతి

శనివారం । 28 । అక్టోబర్ । 2023



పోలీస్ స్టేషన్ తనిఖీ

స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. - 8లో



ఆయుర్వేద వైద్యం..

ఆయుర్వేద వైద్య విధానాన్ని ప్రపంచ వ్యాప్తం చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి పిలుపునిచ్చారు. - 8లో



స్వదేశీ వస్త్రాల వినియోగంతో దేశాభివృద్ధి

స్వదేశీ వస్త్రాల వినియోగంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్‌బాబు అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

షటిల్ కోర్టు ప్రారంభం



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో తిరుపతి డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతృత్వంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును శుక్రవారం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చురుగ్గా పనిచేయడానికి రోజూ వ్యాయామం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ తిరుపతి డివిజన్ అధ్యక్షులు ఎం.అశోక్‌రెడ్డి, యూనియన్ నేతలు జీ.శ్యామ్‌ప్రసాద్, యం.ఈశ్వర్, సీ. జీవన్‌కుమార్, తిరుపతి అర్బన్, రూరల్, పాకాల, ఆర్‌సీపురం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోపు వంద శాతం ఇళ్లు పూర్తి



వెంకటేశ్వరరావు

తిరుపతి అర్బన్: జిల్లాలోని జగనన్న కాలనీల్లో డిసెంబర్ లోపు వంద శాతం ఇళ్లు పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 72,437 మందికి ఇంటి పట్టాలివ్వగా.. అందులో 69,210 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. 96 శాతం ఇండ్లు మంజూరు చేసిన తిరుపతి జిల్లా రాష్ట్రంలో 8వ ర్యాంక్‌లో ఉందని వెల్లడించారు. మిగిలిన 4శాతం మంది నాలుగు రోజుల్లో ముందుకు వస్తే వారికి ఇండ్లు మంజూరు చేయడంతోపాటు ఇంటి నిర్మాణానికి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని 577 జగనన్న లే అవుట్లలోనూ ఇంటి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే 20,511 ఇండ్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు నిర్వహించారని, మిగిలిన ఇండ్లు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీకి 80శాతం, డిసెంబర్ 31వ తేదీకి 100శాతం గృహప్రవేశాలు చేయించాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు.

నేడు పెంచలకోన ఆలయం మూసివేత

రాపూరు: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా స్థానిక పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం 5 నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు మూసివేయనున్నట్టు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం యథావిధిగా ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, నిత్యకైంకర్యాల అనంతరం ఉదయం 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,055 మంది స్వామివారిని దర్శించుకోగా 27,088 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆయుధాల ప్రదర్శన

తిరుపతి క్రైం: పోలీస్ అమరవీరుల సమస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎంఆర్ పల్లి సమీపంలోని ఏఆర్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ (ఆయుధాల ప్రదర్శన) శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయుధాల వినియోగంపై వారికి పోలీసులు అవగాహన కల్పించారు.

4న సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో అప్రెంటీస్ చేయడానికి సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఐటీఐ విద్యార్థుల సర్టిఫికెట్లను నవంబర్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరులోని ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్‌లో పరిశీలించనున్నట్టు పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకెళ్లాల్సి ఉందని ఆయన సూచించారు.

తిరుమలలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం దర్శించుకోనున్నారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డితోపాటు స్వాగతం పలికారు.

జైత్రయాత్ర

వైఎస్సార్‌సీపీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయంగా సాగింది. తిరుపతిలో ఎటు చూసినా జన సునామీని తలపించింది. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు స్వచ్ఛందంగా కదలిరావడం ప్రత్యేకతను సంతరించుకుంది. జై జగన్ నినాదాలతో ఆధ్యాత్మిక నగరం ప్రతిధ్వనించింది. కనీవిని ఎరుగని రీతిలో మహిళా లోకం తరలివచ్చింది. నేతల ప్రసంగాలను యువత ఆసక్తిగా ఆలకించడం.. తిరునగరి అభివృద్ధిని వివరిస్తుండగా చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేయడం నాయకుల్లో సంతోషాన్ని నింపింది. పెత్తందారులు.. పేదల మధ్య జరుగుతున్న కురుక్షేత్ర యుద్ధంలో జైత్రయాత్ర కొనసాగడం తథ్యమని.. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రతినబూనింది.

- తిరుపతిలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- స్వచ్ఛందంగా తరలివచ్చిన జనం
- కిక్కిరిసిన వీధులు
- ఆలోచింపజేసిన నేతల ప్రసంగాలు



సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష జనం (ఇన్‌సెట్) పంకా.. విజయ ధంకా

తిరుపతి తుడా, తిరుపతి మంగళం: 'రాజకీయాల్లోకి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పైరవీలతో రాలేదు.. ఓ ఫైటర్‌గానే వచ్చి ప్రజాదారణ పొంది నాయకుడయ్యాడు' అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతిలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజామద్దతుతో ఉన్నతశిఖరాలను అధిరోహించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గెలుపును బాధ్యతగా తీసుకుని సామాజిక న్యాయం కోసం రాజీలేని నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన మాట కోసం, తండ్రి ఆశయ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని గుర్తుచేశారు. జగనన్న అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో సామాజిక న్యాయం కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతిగా జగనన్న చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల్లో అగ్రస్థానాన్ని కట్టబెట్టిన జగనన్నకు అండగా నిలవాల్సి అవసరం ఆసన్నమైందన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదని, బ్యాక్‌బోన్ అని గుర్తించి తన పాలనలో అగ్రస్థానం కల్పించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు నల్లాని బాబు, కో–ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు అజయ్‌కుమార్, సేవాదళ్ కో- ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూలేకు నివాళి అర్పిస్తున్న టీటీడీ చైర్మన్, ఎంపీలు, ఇతర నేతలు



నేను సైతం!

పేదల పెన్నిధి జగనన్న

రాష్ట్రంలోని 70 శాతానికి పైగా ఉన్న పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న పాలన సాగుతోంది. టీడీపీ, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న తోకపార్టీలది పేదల పట్ల ద్వేషం తప్ప మరొకటి లేదు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూశారే తప్ప వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదల కోసం పనిచేయలేదు. సంక్షేమం మరింతగా కొనసాగాలంటే రాష్ట్రమంతా జగనన్నకు మద్దతుగా నిలవాలి.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

యాదవులకు పేటెంట్ హక్కు జగనన్న

ఒకప్పుడు యాదవులంతా ఎన్టీఆర్‌కు మద్దతుగా నిలిచారు. ఆ తర్వాత చంద్రబాబునూ నమ్మి మోసపోయారు. యాదవులను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశారు. వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలను విస్మరించారు. చంద్రబాబు మోసాలను గుర్తించిన యాదవులు ఇప్పుడు జగనన్నకు మద్దతుగా నిలిచారు. యాదవ యువతకు చంద్రబాబు గొర్రెల పథకాన్ని అమలు చేస్తే జగనన్న వారి ఉజ్వల భవిష్యత్తుకు, ఉన్నత చదువుల కోసం బాటలు వేశారు. అందుకే యాదవులకు పేటెంట్ హక్కుగా జగనన్న మారారు.

– అనీల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి

సైకిల్ సర్వీస్ చేసేందుకే పవన్

తుప్పుపట్టి షెడ్‌కు చేరిన టీడీపీ సైకిల్‌కు సర్వీస్ చేసి రోడ్డెక్కించేందుకు పవన్‌కళ్యాన్ ప్రయత్నిస్తున్నాడు. పవన్‌కళ్యాన్ చేస్తున్న ఆ ప్రయత్నం విఫలమవుతుందే తప్ప తిరిగి ఆ సైకిల్ రోడ్డెక్కబోదు. పవన్‌కళ్యాన్ అమాయకత్వాన్ని చంద్రబాబు పూర్తిస్థాయిలో క్యాష్ చేసుకుంటున్నారు. చంద్రబాబు సొంత కొడుకు ముద్దపప్పు కావడంతో ఏ దిక్కూలేక పవన్‌కళ్యాన్ అద్దె కొడుకును తెచ్చుకున్నారు. గత ఎన్నికల్లో నారాలోకేష్ అవినీతిని బహిరంగంగా ఎండగట్టిన పవన్‌కళ్యాన్ అదే లోకేష్‌తో కలిసి రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. రాజనీతి లేని చంద్రబాబుతో చెయ్యి కలిపిన పవన్‌కళ్యాన్‌ను ఏమి అనాలో జనసైనికులే ఆలోచించాలి.

– మార్గాని భరత్, ఎంపీ రాజమహేంద్రవరం

అభినవ అంబేడ్కర్ జగన్

రాష్ట్రంలో సామాజిక న్యాయం విరాజిల్లుతోంది. గత పాలకులంతా ఎన్నికల్లో మాత్రమే సామాజిక న్యాయం గురించి మాట్లాడేవారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో సామాజిక న్యాయాన్ని తీసుకొచ్చారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక తొలిసారి రాష్ట్రంలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను గుర్తించి వారి ఎదుగుదలకు పెద్దపీట వేసిన చరిత్ర జగనన్నకే దక్కుతుంది. తిరుపతిలో సామాజిక సాధికార యాత్ర ఓ ఉద్యమంలా సాగింది. 40 ఏళ్లలో ఎవ్వరికీ సాధ్యంకాని విధంగా తిరుపతి అభివృద్ధి నాలుగేళ్లలో పట్టాలెక్కించిన ఘనత అభినయ్‌రెడ్డికే దక్కుతుంది.

– కళత్తూరు నారాయణస్వామి, ఉపముఖ్యమంత్రి

40 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకునే..

రాబోయే 40ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిరుపతిని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాము. 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఫ్రీలెఫ్ట్‌లు, రోడ్ల విస్తరణ పనులను పూర్తిచేశాము. రాబోవు రోజుల్లో మరో 12 మాస్టర్‌ప్లాన్ రోడ్లుతో పాటు మరిన్ని ఇంటర్నల్ రోడ్లను అందుబాటులోకి తెస్తాం. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భూమన కరుణాకరరెడ్డికి 80 వేల ఓట్లు వేస్తే జగనన్న ప్రభుత్వంలో 2 లక్షల మందికి సంక్షేమ పథకాలను అందించారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని 22ఏ నిషేధిత జాబితా నుంచి ప్రజల భూములకు విముక్తి కల్పించాం. తద్వారా 12 వేల మందికి లబ్ధి చేకూరింది. 75 ఏళ్లుగా పరిష్కారం కాని శెట్టిపల్లి భూములకు పరిష్కారం చూపాం. శెట్టిపల్లి భూములు వేదికగా ఐటీ హబ్ రాబోతోంది. తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఘన చరిత్ర సీఎం వైఎస్.జగనన్నదే. టీటీడీ ఉద్యోగులకు ఇళ్లస్థలాలు ఇచ్చిన చరిత్ర జగనన్నదే. పారిశుద్ధ్య కార్మికులకు ఒకే సారి రూ.5వేల వేతనాన్ని పెంచి కార్మికుల పక్షపాతిగా నిలిచారు. శ్రీనివాస సేతు, వినాయకసాగర్, ఆడిటోరియం, క్రికెట్ స్టేడియం, మల్టీలెవల్ కారు పార్కింగ్, సిటీ ఆపరేషన్ సెంటర్ నూతన భవన ప్రాజెక్టులను చేపట్టిన ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికే దక్కుతుంది.

– భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి



అభివాదం చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

17 కి.మీ సాగిన యాత్ర

- నగరంలో సామాజిక సాధికార యాత్ర 17 కి.మీ వరకు సాగింది.
- మొదట బాలాజీ కాలనీలోని జ్యోతీరావ్‌పూలే విగ్రహానికి పూలమాల వేసి యాత్రను ప్రారంభించారు.
- టౌన్‌క్లబ్, ఎల్ఐసీ రోడ్డు, ఐఎస్‌మహల్, వివేకానందకూడలి, ఓల్డ్‌మెటర్నటీ రోడ్డు, భవానీనగర్, పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, లీలామహల్ కూడలి, తిరుమల బైపాస్‌రోడ్డు, అన్నారావ్‌సర్కిల్, కపిలితీర్థం, శివజ్యోతినగర్, జీవకోన, రాజీవ్‌గాంధీకాలనీ, కరకంబాడిరోడ్డు, లీలామహల్ సర్కిల్‌మీదగా కొర్లగుంట రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, బ్లిస్ సర్కిల్, లక్ష్మీపురం సర్కిల్, టీవీఎస్ షోరూం మీదగా డీఆర్ మహల్, రైల్వేస్టేషన్, కర్నాలవీధి, కృష్ణాపురం టాణా, గాంధీరోడ్డు, నాలుగుకాళ్ల మండపం, సెంట్రల్‌పార్క్, తుడా సర్కిల్, తాతయ్యగుంట గంగమ్మ ఆలయం మీదగా గ్రూప్ థియేటర్స్ వద్ద బహిరంగ సభ వరకు యాత్ర సాగింది.

అభినయ్‌ని ఆశీర్వదించండి

నాకు ఏమాత్రం పుత్రవాత్సల్యం లేదు. నాకు బిడ్డలే వద్దనుకున్న దశలో చాలా ఆలస్యంగా అభినయ్ పుట్టాడు. రాజకీయ వారసత్వంగా కాకుండా అతనిలో ఉన్న విజన్, కమిట్‌మెంట్‌ను గుర్తించాను. డెప్యూటీ మేయర్‌గా జగనన్న చిన్న అవకాశం కల్పించారు. అనతికాలంలోనే తిరుపతి అభివృద్ధికి అభినయ్ చేసిన ప్రతిపాదనలు, నగర దశను మార్చాయి. మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధితో నగరం మరో ఐదు వేల ఎకరాల్లో విస్తరిస్తోంది. తద్వారా నగరానికి కనెక్టివిటీ పెరిగింది. ట్రాఫిక్ కష్టాలు తగ్గుముఖం పట్టాయి. తిరుపతి అభివృద్ధిపై అభినయ్‌కి ఉన్న చిత్తశుద్ధిని నగరవాసులు గుర్తించారు. నా బిడ్డకు అర్హత ఉంటేనే గెలిపించండి. మంచివాడైతేనే అక్కున చేర్చుకుని ఆదరించండి.

– భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే



యాత్రలో ఎంపీలు విజయసాయిరెడ్డి, గురుమూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి



ఆత్మీయ స్వాగతం



108..రైట్‌రైట్



జగనన్న సైనికులం



మాట్లాడుతున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి

విద్య.. క్రీడలకు సమ ప్రాధాన్యం

- వ్యాయామంతో ఆరోగ్యం
- జోనల్ స్థాయి ఆటల పోటీలు ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె : విద్యతోపాటు క్రీడలకు సైతం సమ ప్రాధాన్యమివ్వాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం చౌడేపల్లెలోని విజయవాణి రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో గ్రిగ్ మెమోరియల్ పుంగనూరు జోనల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుంగనూరు, చౌడేపల్లె, సోమల,సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి మండలాలనుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. వ్యాయామం ప్రతి ఒక్కరికీ అవసరమని, దీంతో ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని తెలిపారు. క్రీడా పోటీలను విద్యార్థులు స్పోర్టివ్‌గా తీసుకోవాలని, ఓడిన వారు నిరుత్సాహ పడకుండా రెట్టింపు ఉత్సాహంతో మరింతగా సాధన చేయాలని సూచించారు. ఇప్పటికీ గ్రామీణ విద్యార్థులే క్రీడల్లో ఉత్తమంగా రాణిస్తుంటారని, ప్రతిభ గల వారిని ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాల్లోనూ ప్రాధాన్యం పొందవచ్చని వెల్లడించారు. క్రీడాకారులు ఉన్నత స్థాయి పోటీలకు వెళ్లేందుకు తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర మూర్తి, నాయుని గురుశేఖర మూర్తి, నాయుని మహేష్, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, యువ కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, ఎంపీడీఓ సుధాకర్,ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, పీడీలు రామచంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 17,61,328 మంది ఓటర్లు

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్ల ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 17,61,328 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు–8,62,198, స్త్రీలు–8,98,909, ఇతరులు 221 ఉన్నారని వెల్లడించారు. 2024 ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 2,130 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. జనవరి 5వ తేదీన ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చంద్రముని, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

కొత్తగా ఓట్ల నమోదు చేసుకోదలిచిన వారు 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండి ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి వారు శనివారం నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అదనపు సమాచారం కోసం టోల్ ఫ్రీ నం.1950లో సంప్రదించాలని ఆయన సూచించారు.

టీటీడీ విద్యాకానుక కిట్ల పంపిణీ

తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక శ్రీకోదండ రామస్వామి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శుక్రవారం టీటీడీ విద్యాకానుక లోగోను ఆవిష్కరించడంతో పాటు విద్యార్థులకు టీటీడీ విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేఈఓ సదాభార్గవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న విద్యాకానుకను స్ఫూర్తిగా తీసుకుని టీటీడీ విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. అందులో భాగంగా టీటీడీ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోని 2,327 మంది విద్యార్థులకు టీటీడీ నిధులతో విద్యాకానుక కిట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో యూనిఫారమ్, నోటుపుస్తకాలు, బెల్టు, బూట్లు ఉన్నాయని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠశాలల పునఃప్రారంభం నాడే వీటిని అందిస్తామని తెలిపారు. టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.



విద్యార్థినికి కిట్టును అందజేస్తున్న జేఈఓ

అండర్-19 హాకీ, బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో అండర్–19 హాకీ, బ్యాడ్మింటన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఆయా పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరి మధ్య పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన 18 మంది బాలురు, 18 మంది బాలికలను హాకీ, ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలను బ్యాడ్మింటన్ బాలబాలికల జట్లకు ఎంపిక చేసినట్లు ఎస్జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు.

ఆయుర్వేద వైద్యాన్ని ప్రపంచవ్యాప్తం చేయాలి



రూమాశాప్ బామ్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ జేఈఓ సదాభార్గవి

తిరుపతి కల్చరల్: ఆయుర్వేద వైద్య విధానాన్ని ప్రపంచ వ్యాప్తం చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి ఆయుర్వేద వైద్యులకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీకి చెందిన అఖిల భారత ఆయుర్వేద మహాసమ్మేళనం, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వం శాఖ, టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో తుడా కార్యాలయం వద్దనున్న కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం ×ఆయుర్వేద పర్వం –2023₹ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. జేఈఓ మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి నుంచి ఆయుర్వేదం విస్తృతంగా వ్యాప్తి చెందాలని ఆకాంక్షించారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో 30 ఔషధాలను తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. కేరళలోని ఆయుర్వేద సంస్థలతో ఒప్పందం చేసుకుని ఉన్నత ప్రమాణాలను నెలకొల్పుతామన్నారు.

రుమాశాప్ పెయిన్ బామ్ ఆవిష్కరణ

నరసింగాపురంలోని శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో రుమాశాప్ పేరుతో టీటీడీ సొంతంగా తయారు చేసిన పెయిన్ బామ్‌ను ఈ సందర్భంగా జేఈఓ ఆవిష్కరించారు. అదేవిధంగా టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల అలూమినీ అసోసియేషన్ లోగోను కూడా ఆవిష్కరించారు. దీనికిముందు ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఆయుష్ శాఖ ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన ఆయుర్వేద, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్య విధానాలకు సంబంధించిన ప్రదర్శనశాలలను ఆమె తిలకించారు. ఆయుష్ మంత్రిత్వశాఖ సహాయ కార్యదర్శి బిశ్వజిత్‌కుమార్ సింగ్, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షుడు డాక్టర్ దేవేందర్ త్రిగుణ, ఆయుష్ సలహాదారుడు డాక్టర్ మనోజ నేసరి, ఎన్‌సీఐఎస్ఎం చైర్మన్ డాక్టర్ జయంత్ డియోపూజారి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణుదీక్షిత్, అధ్యాపకులు డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ నారపరెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శ్రీహర్ష పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌కు 54 మంది విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన యశ్వంత్ కృష్ణను అభినందిస్తున్న కార్యదర్శి దేవరాజు

తిరుపతి కల్చరల్: జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభతో 54 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్పీజేఎన్ఎం స్కూల్లో శుక్రవారం అండర్–14, 17, 19 విభాగాలలో జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో అండర్–14 విభాగంలో 18 మంది, అండర్–17 విభాగంలో 18 మంది, అండర్ –19 విభాగంలో 18 మంది మొత్తం 54 మంది ఎంపికైనట్లు ఫెడరేషన్ కార్యదర్శి పి.విజయకుమారి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ఎంపికైన వారు ఈనెల 28, 29, 30వ తేదీలలో రాజమండ్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన వారిలో మారుతీనగర్, కొర్లగుంట శ్రీవారి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి బి.యశ్వంత్ కృష్ణ ఉన్నారు. టీమ్ మేనేజర్ కె.సుధ, స్కూల్ ప్రిన్సిపల్ బాలక్రిష్ణయ్య, పీఈటీ శివ, యాజమాన్యం,విద్యార్థులకు పది రోజులపాటు కోచింగ్ ఇచ్చి తీర్చిదిద్దిన వారిని జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజు అభినందలు తెలియజేశారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

పాకాల: పోలీస్ స్టేషన్‌ని జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం చేయాలని సూచనలు చేశారు. పాకాలకు సమీపంలో ఉన్న జాతీయ రహదారుల్లో నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉంటాయని, వాటిని అరికట్టేందుకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అప్పుడప్పుడు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేపట్టి ఎర్రచందనం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టాలని పేర్కొన్నారు. డీఎస్పీ యశ్వంత్, సీఐలు చంద్రశేఖర్‌పిళ్లై, ఓబులేసు, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి నిర్లక్ష్యంపై ఫిర్యాదు

తిరుచానూరు(చంద్రగిరి): ప్రసవం కోసం ఆస్పత్రిలో చేర్పిస్తే వైద్యురాలు నిర్లక్ష్యంగా చికిత్స అందించడంతోనే తన కుమార్తె, పురిటి బిడ్డ మృతి చెందిందంటూ బాధితురాలు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలు హంసవేణి తన రెండో కుమార్తె లీలావతి(29), ఆమెకు పుట్టిన శిశువు మరణానికి వైద్యురాలి నిర్లక్ష్యం కారణమైందని, వైద్యురాలితోపాటు ఆమె భర్తపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణదాన పథకానికి 26 మంది ఎంపిక

తిరుపతి తుడా: స్విమ్స్‌లో పేద రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు టీటీడీ ప్రాణదాన పథకం కింద 26 మందిని ఎంపిక చేశారు. ఈ మేరకు స్విమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ప్రాణదాన కమిటీ సమావేశమైంది. టీటీడీ జేఈఓ సదాభార్గవి అధ్యక్షతన డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆధ్వర్యంలో ప్రాణదాన పథకానికి రోగులను ఎంపిక చేసినట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, భాస్కర్, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న మునగలపాళెంలో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న లక్ష్మి, శ్రీహిత బాలికల అండర్–14లో, అనిల్ బాలుర అండర్–14లో ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. వీరు నవంబర్ 4, 5, 6 తేదీల్లో నెల్లూరు జిల్లా ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 12వ తేదీన శ్రీకాళహస్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హితేష్, నిఖిల్ అండర్–14 బాలుర విభాగంలో ఎంపికయ్యారని, వీరు నవంబర్ 1, 2, 3 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా వీరవసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ రామకృష్ణను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ముక్కంటి సేవలో హైకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ నరసింహారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పూల కోసం వెళ్లి.. కానరాని లోకాలకు

చిల్లకూరు: చెరువులోని కలువ పూలు కోసేందుకు వెళ్లి బురదలో కూరుకుపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పలమలమాల సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు.. పల్లమాల గ్రామానికి చెందిన పిట్టి కోటయ్య (52) అనే వ్యక్తి గ్రామానికి సమీపంలోని పెన్నాక చెరువులో కలువ పూలు కోసి మార్కెట్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కలువ పూల కోసం చెరువులో దిగి ప్రమాదవశాత్తు బురదలో కూరుకుపోయాడు. అయితే కుటుంబ సభ్యులు పూలు కోసుకుని మార్కెట్టుకు తీసుకెళ్లి ఉంటాడని భావించారు. సాయంత్రం అటుగా వెళ్లిన వారికి మృతదేహం పైకి తేలి కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కోటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కలిచివేశాయి.

స్వదేశీ వస్త్రాల వినియోగంతో దేశాభివృద్ధి

చంద్రగిరి: స్వదేశీ వస్త్రాల వినియోగంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు అన్నారు. ఖాదీ మహోత్సవం పేరిట శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు తీసుకెళ్లాల్సిందిగా హెచ్‌ఎంలకు వారు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమం సమయంలో జాతిపిత మహాత్మగాంధీ విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ వస్త్రాలను వినియోగించాలని ఉద్యమం తలపెట్టారన్నారు. దీంతో స్వదేశీ వస్త్రాలైన ఖాదీ దుస్తులకు ఎనలేని ఆదరణ లభించిందన్నారు. స్వదేశీ వస్తువులపై పూర్తి అవగాహన రావాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణా రెడ్డి, మండలంలోని ఉన్నత పాఠశాల తెలుగు, ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడును తిరుపతి జిల్లా ప్రోటోకాల్–2 అధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా డిప్యూటీ కలెక్టర్ శంకరయ్యను చిత్తూరు కలెక్టరేట్‌లోని కేఆర్‌ఆర్‌సీ (కోనేరురంగారావు కమిటీ) విభాగంలో నియమిస్తున్నట్లు పేర్కొంది.

విశ్వం పూర్వ విద్యార్థికి ఎమ్మెల్సీ అభినందన



ఎన్‌డీఏకు ఎంపికైన విశ్వం పూర్వ విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ ప్రవేశ పరీక్షలో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల పూర్వ విద్యార్థి గువ్వల ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం విశ్వం విద్యాసంస్థలో ఏర్పాటుచేసిన అభినంద సభకు ముఖ్యఅతిథిగా అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల సిలబస్‌తోపాటు జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి ప్రవేశ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం పూర్వ విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు. విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొన్నారు.